## పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 8: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద కొనసాగుతున్న పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆదేశించారు. పట్టణ శివారులోని సోమార్‌పేట్ బేస్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రోడ్డు పనులు, డ్రైనేజీలను త్వరగా పూర్తిచేయాలన్నారు. పనులు నాణ్యతతో సకాలంలో చేపట్టాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు సుభాష్‌అప్పా, గాదె తిరుపతి తదితరులున్నారు.

## నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, అక్టోబర్ 8: ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టులోకి మంగళవారం 18,700క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులకు ప్రస్తుతం 1404.86అడుగుల నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

## రుణమాఫీపై చైర్మన్, సీఈవో నిలదీత

లింగంపేట, అక్టోబర్ 8: లింగంపేట సహకార సంఘంలో రుణాలు పొందిన ప్రతి రైతుకూ రుణమాఫీ కావాలని, రుణమాఫీపై సహకార సంఘం సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కలిసి సంఘం సిబ్బంది, చైర్మన్‌తో చర్చించారు. సహకార సంఘంలో 1683 మంది రైతులు రుణాలు తీసుకుంటే 666 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, మిగిలిన వారికి ఎందుకు మాఫీ కాలేదని చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్యను ప్రశ్నించారు. సహకార సంఘం సిబ్బంది నిర్లక్ష్యంతోనే రుణమాఫీ కాలేదని వారు ఆరోపించారు. రుణమాఫీ పొందిన రైతులకు రుణాలు ఇవ్వకుండా కొత్తవారికి ఎలా రుణాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. కొత్తవారికి ఎందుకు సభ్యత్వం ఇవ్వడం లేదని నిలదీశారు. పాలక వర్గ సభ్యులకు కావల్సిన వారికి మాత్రమే రుణాలు అందిస్తున్నారని సహకార సంఘం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలక వర్గ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేదేలేదన్నారు. సహకార సంఘం సిబ్బంది చేసిన తప్పుల కారణంగా రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. సహకార సంఘంలో నూతన రైతులకు సభ్యత్వం కల్పిస్తామని సీఈవో పెంటయ్య నాయకులతో తెలిపారు. సహకార సంఘం ఉన్నతాధికారులతో చర్చించి ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ విషయమై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. సహకార సంఘం పరిధిలో రుణాలు పొందిన 944 మందికి రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు ఎల్లమయ్య, అశోక్, ప్రసాద్‌గౌడ్, అన్నం సాయిలు, కుర్మ సాయిలు, భైరయ్య, నగేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వరి కోతలు షురూ..!



బాన్సువాడ రూరల్, అక్టోబర్ 8 : మండలంలో వానకాలంలో సాగు చేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, జక్కల్‌దాని తండా గ్రామాల్లో హార్వెస్టర్లతో వరి పంటలు కోస్తున్నారు. రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతూ కోతలు ప్రారంభించారు.

## జలశక్తి అభియాన్ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ బెంజమెన్ కరుణాకరన్

కామారెడ్డి, అక్టోబర్ 8 : జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపడుతున్న కార్యక్రమాలు పరిశీలించడానికి కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ బెంజమెన్ కరుణాకరన్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలో జలశక్తి కార్యక్రమం కింద వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు వివరించారు. గ్రామీణాభివృద్ధి, గ్రౌండ్ వాటర్, అటవీ, నీటి పారుదల, వ్యవసాయం, ఉద్యానవనం శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆయా శాఖాధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంసవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీకృష్ణ పవార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అటవీ అధికారిణి నిఖిత, జడ్పీ సీఈవో చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యాన అధికారిణి జ్యోతి, గ్రౌండ్ వాటర్ అధికారి సతీష్, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ మేళా బ్రోచర్ల ఆవిష్కరణ

కామారెడ్డి, అక్టోబర్ 8 : హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఈనెల 23 నుంచి 27 వరకు నిర్వహించే స్వదేశీ మేళా బ్రోచర్లను మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాలంబి భారత్ అభియాన్ దిశగా ఐదు రోజులపాటు జరిగే ఈ మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని, ఇందూర్ విభాగ్ కో-కన్వీనర్ రాజాగౌడ్, జిల్లా కన్వీనర్ రాహుల్, యాలిద్రి, మనీష్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

## వెంబడించి.. డబ్బులు దోచేశారు..

- 85వేలు చోరీ చేసి పరార్
- అక్కంపల్లిలో ఘటన



రాములు

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 8: డబ్బులు డ్రా చేసుకొని ఇంటికి వెళ్తున్న వ్యక్తి చేతిలో నుంచి రూ.85వేలు చోరీ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపల్లి గ్రామానికి చెందిన రాములు మంగళవారం ఉదయం నాగిరెడ్డిపేటలోని యూనియన్ బ్యాంకులో రూ.85వేలు డ్రా చేసుకున్నాడు. డబ్బులు కవర్లో పెట్టుకొని బస్టాండ్ చేరుకున్నాడు. అక్కడ ఆటో ఎక్కి అక్కంపల్లికి బయల్దేరాడు. అండూర్ గ్రామ కూడలి వద్ద ఆటో దిగి అక్కంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు అతడిని దాటి ముందుకు వెళ్లారు. తిరిగి వెనక్కి వచ్చి రాములు చేతిలో ఉన్న కవర్ లాక్కొని పరారయ్యారు. గట్టిగా కేకలు వేయడంతో తాండూర్ చౌరస్తాలో ఉన్న పలువురు యువకులు వెంబడించినా తప్పించుకుపోయారు. కాగా.. బైక్‌పై వారు తనను బ్యాంకు నుంచి వెంబడించారని, ఆటోలో వెళ్తున్న సమయంలో కూడా వెనుకాలే బైక్‌పై ఉన్నట్లు బాధితుడు తెలిపారు. వారు డబ్బులు చోరీ చేస్తారని అనుకోలేదని రోదిస్తూ తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

## ట్రాక్టర్ బోల్తా : బాలుడి మృతి



బోల్తాపడిన ట్రాక్టర్

లింగంపేట, అక్టోబర్ 8: లింగంపేట మండలంలోని బోనాల్ తండాలో ట్రాక్టర్ కింద పడి రమావత్ రుషికేష్ (5) మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. రుషికేశ్ తండ్రి భాస్కర్ తండాలో పనులు ముగించుకున్న అనంతరం ట్రాక్టర్‌ను ఎత్తు ప్రాంతంలో నిలిపి ఉంచాడు. ట్రాక్టర్ పైకి ఎక్కిన రుషికేష్ గేర్లు మార్చాడు. దీంతో ట్రాక్టర్ ముందుకు కదిలి సమీపంలోని పొలాల్లోకి దూసుకువెళ్లింది. ట్రాక్టర్ బోల్తాపడి ట్రాలీ రుషికేష్‌పై పడడంతో ఘటనా స్థలంలోనే బాలుడు మృతి చెందాడు. భాస్కర్‌కు కుమారుడు, కూతురు ఉన్నారని తండావాసులు తెలిపారు. బాలుడి మృతితో తండాలో విషాదం నెలకొన్నది.

## బైక్ చోరీ నిందితుల అరెస్టు

రామారెడ్డి, అక్టోబర్ 8: బైక్ చోరీ నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లపల్లి స్టేజీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అటుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు.. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. తాము బైక్‌లు చోరీచేస్తామని నిందితులు రామారెడ్డికి చెందిన మెట్టు నవీన్, మెట్టు నరేశ్ పోలీసులతో తెలిపారు. నాలుగు బైకులను చోరీ చేసినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

## విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 8: మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ మంగళవారం హన్మాజీపేట్ గ్రామస్తులు వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించారు. ఈ నెల 22న కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. తప్పకుండా రావాలని ఎమ్మెల్యేను కోరారు. బోర్లం సొసైటీ అధ్యక్షుడు సంగ్రాం నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, గ్రామపెద్దలు బాలయ్య, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలకు సురక్షితమైన నీటి సరఫరా



మున్సిపల్ ఏఈతో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకాంత్

**బల్దియా చైర్మన్ శ్రీకాంత్**

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 8: ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు త్వరలో అమృత్ పథకం ద్వారా సురక్షిత తాగునీటిని అందించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏఈ వినోద్‌కుమార్‌తో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు విషయాలను చర్చించారు. అమృత్ పథకం ద్వారా మంజూరైన 35కోట్ల రూపాయల నిధులతో పట్టణంలో వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం పూర్తిచేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో వాటర్ ట్యాంకుల నిర్మాణం కోసం స్థానాలు, పైప్‌లైన్ నిర్మాణ విధానాన్ని ఏఈ వినోద్‌కుమార్ చైర్మన్‌కు వివరించారు. సమావేశంలో నాయకులు జంగం నీలకంఠం అప్పా, మంచిర్యాల విద్యాసాగర్, నునుగొండ శ్రీనివాస్, గాదె తిరుపతి, సుభాష్ అప్పా, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

*డ్రైనేజీ పనులు ప్రారంభించాలి..*

పట్టణంలోని మూడో వార్డు పరిధిలోని మురికి కాలువ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని బల్దియా చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైనేజీలను ఆయన మంగళవారం పరిశీలించారు. మూడో వార్డులో ఉన్న డ్రైనేజీలో నీరు ఎక్కువగా పారి ఇబ్బందిగా ఉన్నదని కాలనీవాసులు ఫిర్యాదుచేయడంతో ఆయన పరిశీలించారు. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయనవెంట నాయకులు నీటకంఠం, విద్యాసాగర్, రఫీక్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, అక్టోబర్ 8:ధాన్యం సేకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. బోధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తాతో కలిసి కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, రైతులు ఏమాత్రం ఇబ్బందులు పడినా, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగినా సంబంధిత అధికారులనే బాధ్యులుగా చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా వెయింగ్ మిషన్లు, ఆన్‌లైన్ వివరాల నమోదుకు ట్యాబ్‌లు సమకూర్చుకోవాలన్నారు. అధికారులంతా సమష్టిగా, సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీఏస్‌వో అరవింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం రమేశ్, డీఏవో వాజిద్ హుస్సేన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాణిజ్య

### సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

### టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

### ఎఫ్‌ఎంసీజీపై పామాయిల్ పిడుగు


న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

# హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

**19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం**

**జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి**

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



*బయ్యర్లలో తగ్గిన ఆసక్తి*

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

*హైడ్రా ఎఫెక్ట్*

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

*దేశవ్యాప్తంగా..*

హైదరాబాద్‌సహ మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

# బీవైడీ సరికొత్త ఈవీ

*సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..*

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.




ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

## ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

## హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ర్టానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ర్టాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# హమ్మయ్య..కోలుకున్నాయి

**సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద**




ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

## స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ర్టానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్‌ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్‌ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.